ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 28.5
కనిష్ఠం 19.0
ANDHRAJYOTHY



సూర్యాపేట
5
మంగళవారం 26 నవంబరు 2024



ట్రిపుల్ఆర్ నిర్వాసితులపై
అసెంబ్లీలో చర్చిస్తా
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
7



ధాన్యం ట్రాక్టర్లు లేకుండా మిర్యాలగూడలో బోసిపోయిన ఓ రైస్ మిల్లు

ధాన్యం తగ్గింది
ధర పెంచేశారు

ధాన్యం కొనుగోళ్లలో 10 రోజుల్లోనే సీన్‌మారింది. ప్రధానంగా సన్న రకాల కొనుగోళ్లలో మిల్లర్ల ఎత్తుగడలు రైతులకు నష్టం కలిగిస్తే, అధికారులకు వృథా ప్రయాసను మిగిల్చింది. ధాన్యం కొనుగోళ్ల నిమిత్తం ఉద్దేశించిన నిబంధనలు ప్రధానంగా తేమశాతాన్ని అడ్డంపెట్టుకొని ఇబ్బడిముబ్బడిగా ధాన్యం వచ్చినప్పుడు ధర కనీస మద్దతుకు మించకుండా నియంత్రించిన మిల్లర్లు ప్రస్తుతం అదే తేమశాతం ఉన్నా, ధాన్యం రాక తగ్గడంతో ధర పెంచేశారు. 10రోజుల క్రితం వరకు మిల్‌పాయింట్ల వద్దకు ట్రాక్టర్లు వస్తే రోజంతా నిలిపి ఉంచగా, ఇప్పుడు రోడ్డుమీద ట్రాక్టర్లే కన్పించడంలేదు. ధాన్యం రాగానే గుమస్తా ద్వారా ధర కూడా నిర్ధారించి వేరే మిల్లుకు రైతులు వెళ్లకుండా కొనుగోలు చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- మిల్‌పాయింట్లకు తగ్గిన ధాన్యం రాక
- 10 రోజుల్లో మారిన పరిస్థితి
- నాన్‌ఆయకట్టులో పూర్తిగా, సాగర్ ఆయకట్టులో 70శాతం పూర్తయిన కోతలు

ఉమ్మడి జిల్లాలోని మిల్‌పాయింట్లను కలెక్టర్,ఎమ్మెల్యే ఉన్నతాధికారులు తనిఖీలు చేసి కఠినంగా ఆదేశాలిచ్చినా 10 రోజుల క్రితం వరకు క్వింటాకు రూ.2,200 నుంచి రూ.2,400 కు మించి ధర ఇవ్వని మిల్లర్లు ప్రస్తు తం కనీసంగా రూ.2,700 నుంచి రూ.2,800 వరకు ధర చెల్లిస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ ధర రూ.3వేలకు చేరే అవకాశం ఉంది. ఓ వైపు గిట్టుబాటు ధర దక్కక, మరో వైపు మిల్‌పాయింట్ల వద్ద విక్రయిద్దామంటే ప్రభుత్వం ఇస్తానన్న రూ.500 బోనస్ కోల్పోయి, సన్నధాన్యం పండించిన రైతులు అన్నివిధాలా నష్టపోయా రు. కలెక్టర్ సహా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంత ప్రయత్నించినా కనీస మద్దతు ధర ఇప్పించగలిగారే తప్ప, ఇప్పుడు చెల్లిస్తున్న ధరను ఆ సమయంలో ఇప్పించలేకపోయారు. ఈ నిబంధనలపైనే ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంటే తప్ప సన్నధాన్యం రైతులకు ప్రయోజనం దక్కని పరిస్థితి నెలకొంది.

తగ్గుముఖం పట్టిన ధాన్యం రాక

అక్టోబరు మూడో వారం నుంచి నవంబరు మూడో వారం వరకు మిల్‌పాయింట్ల వద్ద సన్నధాన్యం ట్రాక్టర్లు బారులు తీరాయి. మిల్‌పాయింట్ల వద్ద విక్రయిస్తే బోనస్ కోల్పోతున్నా తేమశాతాన్ని పట్టించుకోకుండా కొనుగోళ్లు జరుగుతుండడం, వెంటనే డబ్బు చెల్లిస్తుండడంతో సన్నధాన్యాన్ని అత్యధికంగా

- మిగతా 6వ పేజీలో

వానాకాలం పంటల సీజన్ ముగిసి యాసంగి వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. వానాకాలంలో సాగు చేసిన వరి కోతలు చివరి దశకు చేరాయి. కొన్ని చోట్ల ఆలస్యంగా నాట్లు పడగా, అక్కడ మాత్రమే ప్రస్తుతం కోతలు కొనసాగుతున్నాయి. వానాకాలంలో ఉమ్మడి జిల్లాలో రైతులు వరిని అధికంగా సాగు చేశారు. అందులో నాగార్జునసాగర్, మూసీ, ఏఎమ్మార్పీ ప్రాజెక్టుతో పాటు చెరువులు, కుంటల కింద అత్యధికంగా సన్న రకాల వరినే సాగు చేశారు. ఈ సీజన్‌లో సన్నాలను సాగుచేసిన రైతులు అధిక దిగుబడులు సాధించారు.

- (ఆంధ్రజ్యోతి, సూర్యాపేట (కలెక్టరేట్))



యాసంగికి
సమాయత్తం

- చివరిదశలో వానాకాలం వరి కోతలు
- యాసంగిలోనూ సన్నాల సాగుకు రైతుల ఆసక్తి
- ఇప్పటికే నారుమళ్లు సిద్ధం
- ఉమ్మడి జిల్లాలో సుమారు 13 లక్షల ఎకరాల్లో పంటల సాగు

నాన్ ఆయకట్టు ప్రాంతాలు తుంగతుర్తి నియోజకవర్గంతో పాటు యాదాద్రి జిల్లాలోని పలు మండలాల్లో మాత్రం సన్నరకంతో పాటు దొడ్డురకం వరిని రైతులు సాగు చేశారు. వానాకాలంలో సన్నాలను సాగుచేసిన రైతులు ధాన్యాన్ని ఇప్పటికే మిల్లర్లకు విక్రయించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రం దొడ్డు రకం ధాన్యాన్ని రైతులు విక్రయించారు. ప్రభుత్వం సన్నాలకు మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించినా రైతులు మిల్లుల్లో విక్రయించేందుకు ఎక్కువగా ఆసక్తి చూపారు. యాసంగిలో కూడా రైతులు ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సీజన్‌లో సైతం సన్నరకాల వరి సాగుచేసేందుకే రైతులు అధికంగా మొగ్గు చూపుతున్నారు.

మిల్లులకే విక్రయం

సన్నరకం ధాన్యాన్ని రైతులు మిల్లులకే విక్రయించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధరతో పాటు క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా రైతులు మాత్రం మిల్లుల్లోనే విక్రయించారు. మిల్లుల్లో తేమశాతంతో సంబంధం లేకుండా మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలుచేశారు. అంతేగాక క్వింటాకు రూ .2350 నుంచి రూ.2550 వరకు ధర లభించింది. కొనుగోలు కేంద్రాల్లో అయితే తేమ 17శాతం వచ్చే వరకు ధాన్యాన్ని ఆరబెట్టాల్సి ఉంటుంది. దీంతో ధాన్యం బరువు కూడా తగ్గుతుంది. అంతేగాక వాతావరణ మార్పులతో వర్షాలు కురిస్తే ధాన్యం తడిచి అసలుకే మోసం వస్తుంది. ఈ నేపథ్యంలో రైతులు కొనుగోలు కేంద్రాలకు బదులు సన్న రకాల ధాన్యాన్ని నూర్పిడి చేసిన వెంటనే మిల్లులకు తరలించి విక్రయించారు.

యాసంగిలోనూ సన్నాల సాగు

వానాకాలంలో సన్నరకం వరిని అధికంగా సాగు చేసిన రైతులు యాసంగిలోనూ సన్నాల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. వానాకాలంలో సన్నరకం సాగుతో మంచి దిగుబడులు పొందడంతో పాటు ధర కూడా బాగానే వచ్చింది. గతంలో సన్న రకం పంట నాలుగు నెలల తరువాతగానీ చేతికి వచ్చేది కాదు. ఇటీవల పలు విత్తనాలు 100 నుంచి 120రోజుల్లో పంట చేతికి

- మిగతా 6వ పేజీలో

13లక్షల ఎకరాల్లో పంటల సాగు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైతులు యాసంగిలో అన్ని రకాల పంటలు కలిపి సుమారు 13లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేయనున్నారు. నల్లగొండ జిల్లాలో 5.90 లక్షల ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 4.80లక్షలు, యాదాద్రి జిల్లాలో 2.70లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్క నల్లగొండ జిల్లాలో 5.60లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అధికారులు అంచనా వేయగా, 2.75లక్షల ఎకరాల్లో సన్నాల వరి సాగుకానుంది. సూర్యాపేట జిల్లాలో 2.80 లక్షల ఎకరాల్లో సన్నాల రకాలు, మిగతా 2 లక్షల ఎకరాల్లో దొడ్డు రకం వరి సాగుకానుంది. యాదాద్రి జిల్లాలో రైతులు లక్ష ఎకరాల వరకు సన్నరకం సాగుచేసే అవకాశం ఉందని అధికారులు అంచనా.

వానాకాలంలో సన్నాల అధిక దిగుబడి

వానాకాలంలో ఉమ్మడి జిల్లాలో సన్నరకం వరిని సాగు చేసిన రైతులు మంచి దిగుబడులు సాధించారు. సన్నాల సాగు చేసిన రైతులకు ఎకరాకు 28 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఉమ్మడి జిల్లాలో రైతులు ఎక్కువగా చిట్టిపొట్టి, వరంగల్ సన్నాలు, తెలంగాణ సోనా, హెచ్ఎంటీ, ఎంటీయూ 1271, కంపాసాగర్ సన్నాలు, బీపీటీతోపాటు మరికొన్ని రకాలను సాగు చేశారు. సన్నాలు సాగు చేసిన రైతులు నేరుగా వరికోత యంత్రాల ద్వారా వరి నూర్పిడి చేయించి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి విక్రయించారు. సన్నరకానికి క్వింటాకు రూ.2350 నుంచి రూ.2550 వరకు ధర పలికింది.

జీ అరీనా పనులు పూర్తి చేయాలి

పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రమేష్‌రెడ్డి



హోటల్ పనులను పరిశీలిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

సూర్యాపేటరూరల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి):పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన జీ అరీనా హోటల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి ఆదేశించారు.సోమవారం జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి స్టేజీ సమీపంలో ఉన్న తెలంగాణ టూరిజం ప్లాజా ఆధ్వర్యంలో నిర్మిస్తున్న జీ అరీనా హోటల్ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం తరఫున తనవంతు సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. జనవరి 4వ తేదీలోగా పనులు పూర్తిచేసి హోటల్‌ను అందుబాటులోకి తెస్తామని హోటల్ నిర్వాహకుడు సతీష్ వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గట్టు శ్రీనివాస్, షఫీఉల్లా, వెలుగు వెంకన్న, వలాసు దేవేందర్, తండు శ్రీనివాస్, ఫరూఖ్, ధర్మ, కర్ణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు దోహదం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటక్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 60 అడుగుల రోడ్డులో పలు విద్యాసంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలను ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. నేరాల నియంత్రణలో పోలీసులకు ప్రజల భాగస్వామ్యం ముఖ్యమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ జి.రవి, పట్టణ ఇన్‌స్పెక్టర్ గురుకుల రాజశేఖర్, పట్టణ ఎస్ఐలు ఏడుకొండల్, వెంకటరెడ్డి, బాల్నె కుశలవ, తదితరులు పాల్గొన్నారు.

సర్వే డేటా నమోదును వేగవంతం చేయాలి

కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు పూర్తి చేసిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాల డేటా నమోదును వేగవంతం చేయాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. డేటా ఎంట్రీ సమయంలో ఎన్యూమరేటర్లు తప్పనిసరిగా డేటా ఎంట్రీ ఆపరేటర్ల వద్ద ఉండాలన్నారు. డేటా నమోదులో ఎలాంటి తప్పులకు అవకాశం ఇవ్వకూడదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, డీఎస్‌వో రాజేశ్వర్, డీఆర్‌డీవో అప్పారావు, డీపీవో నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

'ప్రజావాణి' దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

వివిధ సమస్యలపై ప్రజలు 'ప్రజావాణి'లో ఇచ్చే దరఖాస్తులను సంబంధిత అధికారులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి నిర్వహించిన 'ప్రజావాణి'లో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలపై స్థానిక అధికారులకు ముందుగా దరఖాస్తు చేయాలన్నారు. అక్కడ పరిష్కారంకాకుంటేనే కలెక్టరేట్‌కు రావాలని సూచించారు. ప్రజావాణికి అన్ని శాఖల జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు. దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని, పరిష్కారం కాకపోతే ఎందుకు చేయలేదో సమాచారాన్ని దరఖాస్తుదారులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైకల్య ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

దివ్యాంగులకు నిబంధనలతో పనిలేకుండా వైకల్య ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి వీరబోయిన వెంకన్న కోరారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌కు వినతి పత్రాన్ని అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వైకల్య ధ్రువీకరణ పత్రం పొందేందుకు మార్గదర్శకాలను సులభతరం చేయాలని కోరారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్‌పీడబ్ల్యూడీ చట్టంలోని సెక్షన్ 20కి సవరణలు చేసి విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలన్నారు. వైకల్య ధ్రువీకరణ పత్రాలను వివిధ రంగుల్లో జారీ చేసి దివ్యాంగుల మధ్య వివక్ష చూపవద్దన్నారు. పూర్తిగా కళ్లు కోల్పోయిన వారికి హైదరాబాద్‌లో కాకుండా సూర్యాపేటలోనే ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం నాయకులు శిరంశెట్టి రామారావు, చినపంగ నర్సయ్య, రమేష్, నాగేశ్వర్‌రావు, వెంకట్ తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి, జడ్జి శ్రీవాణి

మఠంపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, జడ్జి శ్రీవాణి అన్నారు. మండలంలోని మేళ్లచెరువు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. పిల్లలు సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పరి రక్షించుకుంటూ సమాజంలో ఉన్నత పౌరులుగా ఎదగాలని కాంక్షించారు. పిల్లలే దేశ భవిష్యత్ అని, వారిని సక్రమైన మార్గంలో తీసుకెళ్లగలితే గొప్ప సమాజం నిర్మితమవుతుందన్నారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మంచి ప్రవర్తనతో తల్లిదండ్రులకు, గురువులకు పేరు ప్రఖ్యాతులను తీసుకురావాలన్నారు. పిల్లలకు చట్టపరమైన ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ టోల్‌ఫ్రీ నంబర్ 15100కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కోదాడ సీఐ రజిత రెడ్డి, ఎస్ఐ పరమేష్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నూకల సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి డప్పు మల్లయ్య, న్యాయవాదులు వెంకటరత్నం, ప్రవీణ్, రాఘవరావు, నగేష్‌రాథోడ్, దీపిక, సైదా, హుస్సేన్, యాదగిరి, రామలక్ష్మారెడ్డి, నవీన్, ప్రిన్సిపాల్ ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూ పరిధిలో
నేటి పరీక్ష వాయిదా
7

బాలికపై లైంగిక దాడి
- యువకుడిపై పోక్సో కేసు నమోదు

పేట మార్కెట్‌లో
ధాన్యం దొంగలు
8

సలహాలు పాటించి దిగుబడులు పొందాలి

గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త కిరణ్



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

పెన్‌పహాడ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త ఏ.కిరణ్, ప్రాణధార సంస్థ అగ్రోనామి శాస్త్రవేత్త పుండరికాక్ష అన్నారు. సోమవారం మండల పరిధిలోని దూపాడు, లింగాల, గ్రామాల రైతులకు వరిసేద్యం, అధిక దిగుబడులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. వరి డ్రమ్‌సీడర్ ద్వారా నేరుగా విత్తే విధానం, కలుపు మందులు, చీడపీడలు, పురుగుమందుల పిచికారీ, ఎరువుల యాజమాన్యం, వ్యవసాయ యాంత్రీకరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, అరవిందు, వీరయ్య, శ్రీను, సత్యనారాయణ, వ్యవసాయ విద్యార్థులు టీనా,స్నేహ, సరిత, దీపిక, కీర్తన, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వసతులు కల్పించాలి

మహిళా కమిషన్ సభ్యురాలు ఉమాదేవి

సూర్యాపేటటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ కొమ్ము ఉమాదేవియాదవ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రం, చిల్డ్రన్స్ హోం, చివ్వెంల మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలలను మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి కె.నర్సింహారావుతో కలిసి తనిఖీలు చేశారు. అక్కడ విద్యార్థినులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. వారి వెంట సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటర్ హేమలత, జిల్లా మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ చైతన్య లక్ష్మి, తదితరులు ఉన్నారు.



మహిళా కమిషన్ సభ్యురాలు కొమ్ము ఉమాదేవియాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు

యాసంగికి సమాయత్తం

(5వ పేజీ తరువాయి)

వస్తున్నాయి. మార్కెట్‌లో ధర కూడా ఎక్కువగా ఉండడంతో రైతులు సన్నాల సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

నారుమళ్లు సిద్ధం

వానాకాలం సీజన్ ముగియడంతో రైతులు యాసంగి సీజన్ వైపు దృష్టిసారించారు. యాసంగి పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. యాసంగిలో కూడా అత్యధికంగా వరి సాగు చేయనున్నారు. అందుకోసం రైతులు ఇప్పటికే నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. రైతులు యాసంగిల్లో విత్తనాలను మండెకట్టి మొలకలు రాగానే చల్లనున్నారు.

వానాకాలంలో అయితే దుక్కులు దున్ని వడ్లు చల్లి నారుమళ్లు సిద్ధం చేసేవారు. యాసంగిలో త్వరగా నారు నాటేందుకు భిన్నంగా నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు.

యాసంగిలో కూడా సన్నరకాలే



యాసంగిలో కూడా సన్నరకం ధాన్యం సాగు చేస్తున్నా. వానాకాలంలో ఎనిమిది ఎకరాల్లో చిట్టి పొట్టి సన్నరకం సాగు చేశా. ఎకరాకు 40 బస్తాలకు పైగా దిగుబడి వచ్చింది. క్వింటాకు రూ.2,550 ధర ప్రకారం విక్రయించా. ఇంకా కొంత విక్రయించాల్సి ఉంది. ప్రస్తుతం క్వింటాకు రూ.2,800 వరకు కొనుగోలు చేస్తున్నారు. అందుకే యాసంగిలో కూడా 8ఎకరాల్లో సన్నరకం సాగు చేసేందుకు నారుమడి సిద్ధం చేస్తున్నా.

● రాత్ల మోతీలాల్, ఉల్సాయిపాలెం, అడవిదేవులపల్లి, నల్లగొండ జిల్లా

సన్నాలకే రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు



సూర్యాపేట జిల్లాలో యాసంగిలో కూడా ఎక్కువగా సన్నరకం వరి సాగు చేసే అవకాశాలున్నాయి. వానాకాలంలో జిల్లాలో 2.50 లక్షల ఎకరాల్లో సన్నరకం సాగు చేశారు. యాసంగిల్లో 3లక్షల వరకు సాగు చేసే అవకాశముంది. రైతులు సన్నాలను సాగు చేసి మిల్లుల్లో విక్రయిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట నియోజకవర్గాల్లో ఎక్కువగా సన్నరకం సాగు చేసే అవకాశం ఉంది. మార్కెట్‌లో సన్నరకాలకు ధర బాగానే ఉంది. దిగుబడి కూడా మంచిగానే వస్తోంది.

● శ్రీధర్‌రెడ్డి, డీఏవో, సూర్యాపేట జిల్లా

ధాన్యం తగ్గింది... ధర పెంచేశారు..



మిర్యాలగూడ సమీపంలోని మిల్‌పాయింట్ వద్ద పదిరోజుల క్రితం ధాన్యం ట్రాక్టర్లు కిక్కిరిసిన దృశ్యం

(5వ పేజీ తరువాయి)

మిల్‌పాయింట్ల రైతులు విక్రయించారు. ఉమ్మడి జిల్లాలో బోరుబావుల కింద, చెరువుల కింద సాగైన సన్నధాన్యంతో పాటు, నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని నల్లగొండ, సూర్యాపేట జిల్లాల ధాన్యం కూడా మిర్యాలగూడ డివిజన్‌లోని మిల్లులకే వచ్చింది. దీంతో 10 రోజుల క్రితం వరకు మిల్లుల వద్ద ట్రాక్టర్ల రద్దీ కొనసాగింది. ప్రస్తుతం నాన్‌ఆయకట్టులో కోతలు పూర్తవడం, ఆయకట్టులోనూ దాదాపు 70శాతం మేర వరికోతలు పూర్తవడంతో మిల్‌పాయింట్ల వద్ద ఆ ప్రభావం కనిపిస్తోంది. ప్రస్తుతం ఏ మిల్లు వద్ద కూడా పట్టుమని పది ట్రాక్టర్లు కనిపించడం లేదు. ధాన్యం రాక తగ్గడంతో మిల్లర్లు ధర పెంచారు. ఈ ధర గతంలో చెల్లించినట్టయితే రైతులకు ప్రయోజనం చేకూరేది.

ఎంత తేడా?

రైతుల వద్ద ధాన్యం నిల్వలు తగ్గిన వెంటనే మిల్లర్లు ధాన్యానికి ధర పెంచేశారు. మిల్‌పాయింట్ల వద్దకు ఇబ్బడిముబ్బడిగా రోజూ 3వేల ట్రాక్టర్లకు పైగా ధాన్యం వచ్చినప్పుడు తేమశాతం ఎక్కువగా ఉందని, నాణ్యతలేదని సాకులు చెప్పిన మిల్లర్లు కనీస ధర ఎగ్గొట్టారు. కలెక్టర్ సహా ఉన్నతాధికారులు నేరుగా రంగంలోకి దిగి మిల్‌పాయింట్ల వద్ద పర్యవేక్షణ పెంచడంతో పాటు, కనీస మద్దతు ధర చెల్లించాల్సిందేనని హెచ్చరించడంతో ఆ మేరకు ధర ఇస్తూ వచ్చారు. తేమశాతం 28 వరకు ఉంటే క్వింటాకు రూ.2,200, అంతకంటే తక్కువ ఉంటే రూ.2,300, గరిష్ఠంగా రూ.2,400 వరకు ధర చెల్లించారు. నాన్ ఆయకట్టుప్రాంతంలో సాగైన పంట పూర్తిగా, నాగార్జునసాగర్ ఆయకట్టులో దాదాపు 70శాతం మేర ధాన్యం గత వారం వరకు మిల్లులకు వచ్చింది. ధాన్యం రాక ఎక్కువగా ఉన్నంతసేపు ధర పెంచకుండా నియంత్రించిన మిల్లర్లు తాజాగా, ధర భారీగా పెంచేశారు. మిల్‌పాయింట్ల వద్ద ఇప్పుడు సన్నరకాలకు రూ.2,800 వరకు ధర ఇస్తున్నారు. ఈ ధర క్రమేపీ రూ.3,000 వరకు చేరుతుందని వ్యాపారవర్గాల్లో చర్చ సాగుతోంది.

ఎప్పటికప్పుడు ఖాళీ అవుతున్న ధాన్యం

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డివిజన్‌లో విస్తరించిన ఆధునిక టెక్నాలజీ కలిగిన రైస్‌మిల్లుల్లో కొత్త ధాన్యం ఎప్పటికప్పుడు ఖాళీ చేస్తున్నారు. మిల్లుల మిల్లింగ్ సామర్థ్యం గరిష్ఠంగా ఉండడంతో పాటు, కొనుగోలు చేసిన ధాన్యమంతా ఏ రోజుకు ఆ రోజే బియ్యంగా మార్చి వెనువెంటనే మార్కెట్‌కు పంపిస్తున్నారు. అందుకే మిల్లుల్లో ధాన్యం నిల్వలు లేకుండా పోతున్నాయి. ప్రస్తుతం క్వింటాకు రూ.2,800 వరకు ధర చెల్లించేందుకు మిల్లర్లు సిద్ధపడగా, భవిష్యత్‌లో ఈ ధర రూ.3,000కు పైగా చేరే అవకాశం ఉన్నా మిల్లర్లు సన్న ధాన్యం కొనుగోళ్లలో వెనక్కితగ్గే అవకాశం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు ఏపీలోని పల్నాడు, గుంటూరు జిల్లాల నుంచి ఇటు నిజామాబాద్ జిల్లా నుంచి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల నుంచి కూడా సన్నరకం ధాన్యం దిగుమతి చేసుకునేందుకు మిల్లర్లు సన్నద్ధమవుతుండడం, మార్కెట్‌లో సన్నబియ్యానికి ఉన్న డిమాండ్‌ను తెలియజేస్తోంది. విదేశాలకు సన్నబియ్యం ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తివేయడంతో గల్ఫ్‌దేశాలు, యూకే, అమెరికా, థాయిలాండ్, మలేషియా, సింగపూర్ దేశాలకు నల్లగొండ జిల్లా నుంచి సన్నబియ్యం ఎగుమతులు చేసేందుకు అవకాశం ఏర్పడింది. దీంతో అధిక లాభాలు రానుండడంతో మిల్లర్లు ఎగుమతులపై దృష్టి సారించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేశారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు అక్కెనపల్లి విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీఈటీలు

నార్కట్‌పల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈ నెల 21వ తేదీన జరిగిన అండర్-14 విభాగం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అక్కెనపల్లి జడ్పీ విద్యార్థులు మర్రి మనోజ్, ఆవుల ఉదయ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు తరఫున పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఈ నెల 29 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు హుజూరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కరీం తెలిపారు. కాగా రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించి పాఠశాలకు పేరు తెచ్చిన విద్యార్థులను హెచ్ఎం నడింపల్లి వెంకటేశం, మాజీ సర్పంచ్ మాదాసు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు ఘనంగా అభినందించారు.

ఐదుగురు చిట్యాల విద్యార్థులు ఎంపిక



పీఈటీతో రాష్ట్రస్థాయికి ఎంపికైన హాకీ క్రీడాకారులు

చిట్యాల: చిట్యాలలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాల విద్యార్థులు అండర్ 14 హాకీ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ గంగాపురం రాము తెలిపారు. పాఠశాలకు చెందిన రాధారపు భవ్యశ్రీ, పోకల ప్రీతి జెస్సీ, కాసుల తన్విశ్రీ, సోనుసోహేల్, ఆగు దివ్యభాను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

కన్నుల పండువగా కోటమైసమ్మ బ్రహ్మోత్సవాలు

నిడమనూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండల పరిధిలోని ఇండ్లకోటయ్యగూడెం గ్రామం సమీపంలో ప్రసిద్ధి చెందిన శ్రీకోటమైసమ్మ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. ప్రతి సంవత్సరం పవిత్ర కార్తీకమాసంలో ఆలయంలో మూడు రోజుల పాటు ఎంతో వైభవంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం సుప్రభాత సేవ, గణపతిపూజ, బాలభోగము, బలిహరణం, కుంభం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. మంగళ వాయిద్యాలతో ఆగమశాస్త్ర ప్రకారం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పూజ కార్యక్రమాలు నేత్రపర్వంగా నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల చివరి రోజైన మంగళవారం అమ్మవారికి ఉదయం బోనాల సమర్పణ, సాయంత్రం కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చౌటి ఆంజనేయులు, ఈవో సిరికొండ నవీన్, ఆలయ సిబ్బంది విఠలేశ్వర్, రమణయ్య, నార్ల శ్రీనివాస్, నర్సిరెడ్డి, లక్ష్మి, పద్మ, కోటయ్య, వెంకన్న, పుష్పమ్మ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ఆవరణలో బలి చల్లుతున్న దృశ్యం

భారీగా డ్రగ్స్, గంజాయి స్వాధీనం?

- గూడూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసుల విస్తృత తనిఖీలు
- రూ.కోట్ల విలువైన గంజాయి లభ్యమైనట్టుగా సమాచారం

యాదాద్రి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా భారీఎత్తున హైదరాబాద్‌కు తరలిస్తున్న డ్రగ్స్, గంజాయిని యాదాద్రిభువనగిరి జిల్లా గూడూరు టోల్‌ప్లాజా వద్ద సోమవారం స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. మహారాష్ట్ర నుంచి తెలంగాణ జిల్లాల మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తుండగా, పక్కా సమాచారంతో నార్కొటిక్, భువనగిరి జోన్ పోలీసులు గంజాయిని పట్టుకున్నట్టు తెలిసింది. సోమవారం మధ్యాహ్నం నుంచే నార్కొటిక్, భువనగిరి జోన్ పోలీసులు గూడూరు టోల్‌ప్లాజా వద్ద నిఘాను పెంచారు. అనుమానం ఉన్న వాహనాలను తనిఖీలు చేసినట్టుగా సమాచారం. పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో రూ.కోట్ల విలువ చేసే డ్రగ్స్, గంజాయిని స్వాధీనం చేసుకున్నప్పటికీ, స్థానికంగా ఎవరికీ సమాచారం అందంచలేదు. ఎన్ని వాహనాల్లో వీటిని తరలిస్తున్నారు? ఎంతమేరకు లభ్యమైందన్న వివరాలను చాలా గోప్యంగా ఉంచుతున్నారు. స్వాధీనం చేసుకున్న వివరాలు హైదరాబాద్‌లో పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ వహించింది. ఈనేపథ్యంలో గంజాయి, డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాలపై నిఘా సారించింది. జాతీయ రహదారులపై గట్టి నిఘాను ఏర్పాటుచేసింది. హైదరాబాద్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసింది. ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వాహనాలు చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా మీదుగా హైదరాబాద్‌కు చేరుకుంటాయి. అదేవిధంగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రకు చెందిన వాహనాలు గూడూరు టోల్‌ప్లాజా మీదుగా హైదరాబాద్‌కు వెళ్తాయి. ఆయా రాష్ట్రాల నుంచి తెలంగాణకు సరఫరా చేస్తున్న గంజాయిని నియంత్రించే పనిలో సర్కారు నిమగ్నమైంది. ఇటీవల పంతంగి టోల్‌ప్లాజా వద్ద పెద్దఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకుంది. మరోసారి నార్కొటిక్, స్థానిక పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో భారీగా డ్రగ్స్, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లుగా సమాచారం.

ధాన్యానికి మద్దతు ధర ఎందుకు ఇవ్వరు?

- నల్లగొండ జిల్లా త్రిపురారం రైతుల నిరసన



మిల్లు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

త్రిపురారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధాన్యానికి మద్దతు ధర ఎందుకు ఇవ్వరని నల్లగొండ జిల్లా రైతులు నిలదీశారు. సోమవారం సాయంత్రం ఈ మేరకు త్రిపురారం మండలం బాబుసాయిపేట వద్ద రంగా పుడ్స్ మిల్లు వద్ద నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బాబుసాయిపేట వద్ద రంగా పుడ్స్ మిల్లు నుంచి విపరీతంగా బూడిద, పొట్టు వస్తుండటంతో పంటలపై పడి దిగుబడి సరిగా రావడం లేదన్నారు. ఆరుగాలం కష్టపడినా మిల్లు నుంచి వచ్చే పొట్టుతో దిగుబడి తగ్గి తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మార్కెట్ ధర చెల్లించమంటే పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము తెచ్చిన ధాన్యానికి మద్దతు ధర ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. మద్దతు ధర చెల్లించాలని మిల్లు ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రస్తుతం బయట మార్కెట్‌లో క్వింటాకు రూ.2700 వరకు ధర ఉన్నా.. కేవలం రూ.2600 చెల్లిస్తామని లేకపోతే మీ ఇష్టం వచ్చిన దగ్గర అమ్ముకోండని అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ఆందోళన చేయటంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రైతులతో మాట్లాడారు. అయినా వారు మద్దతు ధర చెల్లించాల్సిందేనని అన్నారు. మిల్లు యజమాని పవన్, పోలీసులు రైతులతో చర్చించారు. మంగళవారం ధర గురించి మాట్లాడతామని చెప్పటంతో ట్రాక్టర్లను మిల్లు లోపల పెట్టించారు.

చదరంగంతో పెరగనున్న మేధస్సు



నిర్వాహకులను అభినందిస్తున్న సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్

- సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్

మిర్యాలగూడటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చదరంగ క్రీడతో మేధస్సు పెరుగుతుందని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. చెస్ క్రీడాకారిణి మాశెట్టి దివ్యశ్రీ ఆధ్వర్యంలో పట్టణంలో స్థాపించిన డైమండ్ చెస్ అకాడమీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని అన్నారు. ఎత్తుకు పైఎత్తులు వేసే చదరంగ క్రీడ విద్యార్థుల ఆలోచనా శక్తిని పెంపొందిస్తుందని, తద్వారా ఆటతో పాటు విద్యలోనూ రాణించగలుగుతారని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. పట్టణంలో చెస్ అకాడమీ ప్రారంభించడం హర్షనీయమని, బ్లైండ్ ఫోల్డ్ విభాగంలో శిక్షణనివ్వడం మరింత గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, డైమండ్ శ్రీనివాస్, గీత తదితరులు పాల్గొన్నారు.

నువ్వులేని లోకంలో నేనూ ఉండను

- భార్య మృతిని తట్టుకోలేక భర్త మృతి
- సూర్యాపేట జిల్లాలో ఘటన



దంపతులు వీరయ్య, ఎల్లమ్మ(ఫైల్)

నూతన్‌కల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆ దంపతులు కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ అన్యోన్య జీవితం గడిపారు. తమ పిల్లలను ప్రయోజకులను చేసి తమ బాధ్యత లు నిర్వర్తించారు. జీవిత చరమాంకంలో విశ్రాంతి తీసుకుంటూ ఇంటి వద్దే ఉంటున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భార్య బాగోగులు చూసుకుంటున్న సమయంలో ఆమె మృతిచెందింది. భార్య మృతిని తట్టుకోలేక భర్త కూడా ఈ లోకాన్ని విడిచాడు. ఈ విషాద సంఘటన సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండలంలోని మిర్యాల గ్రామంలో సోమవారం జరిగింది. మండలంలోని మిర్యాల గ్రామానికి చెందిన దంపతులు కొమ్ము వీరయ్య(75), కొమ్ము ఎల్లమ్మ (70)లు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం. కుటుంబ బాధ్యతలు తీరాక వారు గ్రామంలోనే చిన్న కుమారుడు పరమేష్ ఇంట్లో ఉంటున్నారు. ఎల్లమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందింది. తల్లి మరణ వార్తను కుమారులు బంధుమిత్రులకు తెలిపారు. ఆమె అంత్యక్రియలు సోమవారం గ్రామంలో నిర్వహిస్తామని సమాచారం ఇచ్చారు. భార్య మృతదేహం వద్ద బాధపడుతూ ఉన్న భర్త వీరయ్య అర్ధరాత్రి అస్వస్థతకు గురయ్యాడు. కుమారులు స్థానికంగా చికిత్స చేయిస్తుండగానే పరిస్థితి విషమించి వీరయ్య అర్ధరాత్రి మృతి చెందాడు. ఎంతో అన్యోన్యంగా ఉండే దంపతులు మృత్యువులోనూ ఈ లోకాన్ని వీడడంతో గ్రామస్థులు కంటతడి పెట్టారు. వీరయ్య, ఎల్లమ్మలకు బంధువులు సోమవారం మిర్యాల గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

భూనిర్వాసితులకు పునరావాసం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): భూనిర్వాసితులు అధైర్య పడవద్దని, నెల రోజుల్లోనే పునరావాసం కోసం ఏర్పాటు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన నర్సిరెడ్డిగూడెం భూ నిర్వాసితులు సోమవారం హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కలిశారు. భూ నిర్వాసితులకు పునరావాసంతో పాటు అర్హులైన లబ్ధిదారులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వాసితులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే పునరావాసం కాని ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ అందించడంలో ఆలస్యమైందని ఎవరూ అధైర్య పడకూడదని అన్నారు. ఈ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన 275 మందికి భూనిర్వాసితులకు నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని సాయిబాబా దేవాలయం వెనక ఉన్నటువంటి ప్రభుత్వ భూమిలో స్థలాన్ని ఏర్పాటు చేసి బాధితులకు డబుల్ బెడ్‌రూం నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. వారి వెంట భూ నిర్వాసితులు కుక్కడపు వెంకటేష్, కుక్కడపు యాదయ్య, నర్సింహ, చిట్యాల రంగారెడ్డి, చిట్యాల యాదగిరిరెడ్డి, మహేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక

కట్టంగూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుఅన్నారం గ్రామంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 26వ తేదీన ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హ్యాండ్ బాల్ జూనియర్స్ బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య తెలిపారు. ఈ ఎంపికలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. బాల, బాలికల జట్లు ఈ నెల 29 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగే 53వ జూనియర్స్ బాలబాలికల తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

నీలగిరిలో ట్రాఫిక్ పరేషాన్



- షాపింగ్ కాంప్లెక్స్, మాల్స్ వద్ద పార్కింగ్ కరువు
- రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్న వాహనదారులు
- నరకంగా మారుతున్న ట్రాఫిక్ సమస్య

నల్లగొండ క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాలతో నల్లగొండ పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతుంది. వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు, విద్యార్థులు, యువత వివిధ వర్గాల ప్రజలు నల్లగొండ పట్టణానికి వస్తుండటంతో వాహనాల రద్దీ పెరిగింది. దీంతో పట్టణం లో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకూ పెరిగి పరేషాన్‌గా మారుతోంది. జిల్లా కేంద్రంలో షాపింగ్ మాల్స్‌తో పాటు షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఆసుపత్రులు, హోటళ్లు, ఇతర వ్యాపార సముదాయాలు పెరగడంతో పాటు క్రయ విక్రయాలు సైతం పెద్ద ఎత్తున పెరిగాయి. దీంతో వాహనాలు నిలపాలంటే నరకప్రాయంగా మారింది. వివిధ అవసరాల నిమిత్తం వ్యాపార సముదాయాలకు వెళ్లే వినియోగదారులు వాహనాల ను పార్కింగ్ చేయాలంటే పార్కింగ్ స్థలం లేకపోవడంతో నిలపాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని వ్యాపార సముదాయాల వద్ద పార్కింగ్ స్థలాన్ని నామమాత్రం గా కేటాయించడం తో అక్కడ కొన్ని వాహనాలు మాత్రమే పార్కింగ్‌కు అవకాశం ఉంటుంది. మిగ తా వారు వారి వాహనాలను రోడ్డు పక్కనే నిలిపివేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డుపై నిలిపిన వాహనాలకు పోలీసులు తమ విధి నిర్వహణలో భాగంగా జరిమానాలు విధించడంతో వారు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యాపార సముదాయాల నిర్వాహకులు పార్కింగ్ స్థలం సరిపోని విధంగా ఉంటే వాహనదారులకు కనీసం వాలెట్ పార్కింగ్‌నైనా ఏర్పాటు చేయాలి కానీ ఆ దిశగా నల్లగొండ పట్టణంలో ఇప్పటి వరకూ ఏ ఒక్కరూ ఏర్పాటు చేయలేదు. దీంతో వినియోగదారులు రోడ్లపై పార్కింగ్ చేసే పోలీసుల నుంచి జరిమానా షరా మామూలుగానే ఉంది.

నరకంగా మారిన పార్కింగ్ సమస్య..

జిల్లా కేంద్రంలో ఎక్కడ చూసినా పార్కింగ్ సమస్య నరకంగా మారింది. నల్లగొండ నలు మూలల నుంచి వచ్చే వాహనాలు తమ అవసరాల నిమిత్తం ఏమైనా కొనుగోలు చేయాలంటే పార్కింగ్‌కు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రముఖ కంపెనీలు, పేరుపొందిన షాపింగ్ మాల్స్, హోటళ్లు, ఇతరత్రా వ్యాపార సముదాయాల వద్ద పార్కింగ్ సమస్యల మరీ విపరీతంగా ఉంది. జిల్లా కేంద్రంలోని ప్రకాశంబజార్‌లో ఏర్పాటు చేసిన పలు మాల్స్‌తో పాటు ఏక్ మినార్ వరకూ ట్రాఫిక్ సమస్య పెద్ద సవాల్‌గా మారింది. వస్త్ర దుకాణాలతో పాటు మార్కెట్‌కు పేరొందిన అన్ని వ్యాపారాలకు సంబంధించిన అన్ని అందుబాటులో ఉండటంతో ప్రకాశంబజార్ నిత్యం రద్దీగా ఉంటుంది. కొంత మంది రోడ్లపై బండి మీద ఉండే కొనుగోలు చేస్తుండటం, రోడ్డు పక్కనే వాహనాలను నిలిపి ఉంచడం తదితర కారణాలతో ప్రకాశంబజార్ పార్కింగ్ సౌకర్యం లేక ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. అదే విధంగా కూరగాయల మార్కెట్, హైదరాబాద్ రోడ్డులోని షాపింగ్‌మాల్, హోటళ్లు, పలు బ్యాంకులు, మద్యం దుకాణాల వద్ద సైతం వాహనాలు రోడ్లపైనే నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది.

అనుమతి సమయంలో పట్టించుకోని అధికారులు

ఏదైనా ఒక వ్యాపార సముదాయాన్ని, ఇతర దుకాణాలను ఏర్పాటు చేసే సమయంలో అధికారులు ఆయా శాఖలకు సంబంధించి అనుమతి ఇవ్వాలంటే సం బంధిత నిబంధనలు పాటించాల్సి ఉంటుంది.ఏ దు కాణం ప్రారంభించాలన్నా ఆ దుకాణాని కి సంబంధించిన నిబంధనలు, సూచనలు, ఏమేమి కావాలి.. ఎలాంటి షరతులు ఉంటాయో అన్ని గమనించి తనిఖీ చేసి ఆ దుకాణానికి సంబంధించిన అన్ని దస్త్రాలు, నిబంధనలు ఉంటేనే అనుమతి ఇవ్వాలి. కానీ అవేమీ పట్టనట్లుగా జిల్లా కేంద్రంలో వివిధ వ్యాపార సముదాయాలు, దుకాణాలకు అనుమతిలిచ్చినట్లు వినియోగదారులు చర్చించుకుంటున్నారు. కొన్ని దుకాణాల వద్ద పార్కింగ్ స్థలం లేకపోయినా, సరైన నిబంధనలు పాటించకున్నా అనుమతులు ఇచ్చారని, ప్రస్తుతం అక్కడ ఎలాంటి వసతులు, సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో రోడ్డుపై వాహనాలు నిలిపి షాపింగ్‌కు వెళ్లి వచ్చే సరికి ట్రాఫిక్, సంబంధిత పోలీసులు చలానాను విధిస్తున్నారు. దీంతో దుకాణం నుంచి బయటకు వచ్చే లోపు వాహనదారుని సెల్‌ఫోన్‌కు నో పార్కింగ్‌తో జరిమానా విధించినట్లు మెసేజ్ రావడంతో అవాక్కయ్యే పరిస్థితి ఏర్పడింది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నల్లగొండ పట్టణంలో వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. షాపింగ్ సమయాల్లో తమ వాహనాలను షాపుల వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలోనే పార్కింగ్ చేసుకోవాలి. రోడ్లపై పార్కింగ్ చేసి షాపింగ్‌కు వెళ్తే వాహనాల రద్దీ ఎక్కువైన సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. రోడ్లపై పార్కింగ్ చేస్తే చట్టప్రకారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జరిమానా తప్పదు. షాపింగ్ మాల్స్, దుకాణాల నిర్వాహకులు సైతం కస్టమర్లకు వారి వాహనాల పార్కింగ్ కోసం స్థలం కేటాయించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీస్ శాఖకు సహకరించాలి.

- దూది రాజు, ట్రాఫిక్ సీఐ, నల్లగొండ

మాల్స్, షాపింగ్ కాంప్లెక్స్ వద్ద పార్కింగ్‌కు స్థలం కేటాయించాలి



పట్టణంలో వినియోగదారుల కోసం షాపింగ్ మాల్స్, కాంప్లెక్స్, ఇతర దుకాణాల వద్ద వాహనాల కోసం పార్కింగ్ స్థలం కేటాయించాలి. పార్కింగ్‌కు స్థలం సరిపో ను లేకపోవడంతో రోడ్డు పక్కన వాహనాలు నిలిపితే పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. రోడ్డుపై వాహనాలు నిలిపితే ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. అవసరమైతే షాపుల నిర్వాహకులు వాలెట్ పార్కింగ్ (డబ్బులు కడితే ఇచ్చే పార్కింగ్)నైనా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. షాపింగ్ చేసి బయటకు వచ్చే సరికి వాహనానికి జరిమానా విధించినట్లు ఒకసారి మెసేజ్ వస్తే షాకయ్యా. అప్పటి నుంచి దూరంగా వాహనం నిలిపి షాపింగ్ చేస్తున్నాం.

- కె.నరేందర్, నల్లగొండ

క్రీడల్లో మేటి.. చదువులో సాటి

» చదువుతో పాటు ఆటల్లో రాణిస్తున్న సంధ్య » రైతు కుటుంబం నుంచి జాతీయ క్రీడలకు » టీజీపీఈ-సెట్‌లోనూ రాష్ట్ర మొదటి ర్యాంక్

గ్రామీణ ప్రాంతంలోని నిరుపేద కుటుంబంలో పుట్టి మట్టిలో మాణిక్యంగా మెరిసింది యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని అమ్మనబోలు గ్రామానికి చెందిన చిట్టిమల్ల రమేష్-మాదవి దంపతుల చిన్న కూతురు సంధ్య. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూనే మరో వైపు క్రీడల్లో రాణిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అండర్-14, 19 బాలికల విభాగంలో, అటు అథ్లెటిక్స్‌లో రాణించి పలు పతకాలు సొంతం చేసుకుంది.
- (ఆంధ్రజ్యోతి, మోటకొండూరు)



నిరుపేద వ్యవసాయ కుటుంబంలో పుట్టిన చిట్టిమల్ల సంధ్య గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు, ఆలేరులోని వెంకటరమణ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. జూన్ నెలలో వెలుబడిన టీజీపీఈ-సెట్‌లో రాష్ట్ర మొద టి ర్యాంక్ సాధించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని దోమలగూడలోని ప్రభుత్వ కళాశాలలో డిప్లమో ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో మొదటి సంవత్సరం చదువుతోంది. చిన్నతనం నుంచే ఆటల్లో రాణిస్తున్న సంధ్య ఆసక్తి, ప్రతిభ గుర్తించిన గురువులు వెన్నుతట్టి ప్రోత్సహించారు.

చదువుల్లోనూ ప్రతిభ

ఓ వైపు క్రీడల్లో రాణిస్తున్న సంధ్య చదువును ఏమాత్రం నిర్లక్ష్యం చేయలేదు. ఆలేరులోని వెంకటరమణ కళాశాలలో ఇంటర్ చదువుతునే టీజీపీఈ-సెట్‌లో రాష్ట్ర మొదటి ర్యాంక్ సాధించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని దోమలగూడలో ప్రభుత్వ కళాశాల డిప్లొమాలో ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో మొదటి సంవత్సరం చదువుతోంది.

నిరుపేద వ్యవసాయ కుటుంబం

సంధ్య తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చిన్న కుమార్తె సంధ్య ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతునే టీజీపీఈ-సెట్‌లో రాష్ట్ర మొదటి ర్యాంక్ సాధించింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివింది. పాఠశాల సమయంలో చదువుతో పాటు ఆటల్లో రాణించేది. సెలవుల్లో తల్లిదండ్రులతో పాటు వ్యవసాయం, కూలి పనులకు వెళ్తుంది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఎదుర్కొని తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాఠశాల రోజుల్లోనే రాష్ట్ర, జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొని జట్ల విజయాల్లో కీలక భూమిక నిర్వహించి గుర్తింపు పొందింది.

జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

పాఠశాల పీఈటీ గడసంతల మధుసూదన్ ప్రోత్సాహంతో మండల,జిల్లా, రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయి క్రీడల వరకు ఎదిగింది. అండర్-14, 19 బాలికల విభాగం ఫుట్‌బాల్, అథ్లెటిక్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటి జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైంది.

- జనవరి 2024న పంజాబ్‌లో జరిగిన 67వ జాతీయ స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ అండర్-14 విభాగంలో పాల్గొని జట్టులో ఉత్తమ ప్రదర్శన ప్రదర్శించింది.
- జనవరి 2020న హరియాణ రాష్ట్రంలోని కురుక్షేత్రలో జరిగిన 65వ జాతీయ స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ అండర్-14 విభాగంలో పాల్గొంది.
- 2019-20లోమంచిర్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబరిచింది
- 2021లో ఖమ్మంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంది.
- యాదాద్రి భువనగి జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి సీఎం కప్-2023 అథ్లెటిక్స్‌లో 100, 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌లో మొదటి స్థానంలో నిలిచింది. షాట్ పుట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచింది.

పోలీసు కావడమే లక్ష్యం..



భవిష్యత్‌లో పోలీస్ కావడమే లక్ష్యం. వేరే కోర్సులు ఉన్నాయని గురువులను సంప్రదిస్తే టీజీపీఈ-సెట్ గురించి చెప్పారు. చదువుకుంటూనే క్రీడల్లో ప్రాక్టీస్ చేసే దాన్ని. టీజీపీఈ-సెట్‌లో రాష్ట్ర మొదటి ర్యాంక్ వచ్చింది. పదో తరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదివా. నన్ను ప్రోత్సహించిన మా గురువు గడసంతల మధుసూదన్, అధ్యాపక సిబ్బందికి రుణపడి ఉంటా.
- చిట్టిమల్ల సంధ్య

క్రమశిక్షణకు మారు పేరు



చిట్టిమల్ల సంధ్య క్రమశిక్షణకు మారు పేరు. పాఠశాలలో చదువుతున్న రోజుల్లో కబడ్డీ, అథ్లెటిక్స్ శిక్షణ సమయంలో ఎంతో క్రమశిక్షణతో ఉండేది. ఆమె ఆట తీరు ప్రత్యేకంగా ఉంటుంది. పోటీల్లో ఎంతమంది పాల్గొన్నా ఆమె ఆటపైనే అందరి దృష్టి ఉంటుంది. శిక్షణ సమయంలో చాలా కష్టపడడంతో రాష్ట్ర, జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కింది.
- మధుసూదన్, వ్యాయామ ఉపాధ్యాయుడు.

సీఎం సారూ.. నా భూమికి పాస్ పుస్తకాలు ఇప్పించండి

● మీ పార్టీ నాయకుడి అండతో కబ్జా చేశారు



మాట్లాడుతున్న సావిత్రమ్మ

పంజాగుట్ట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'సీఎం రేవంత్‌రెడ్డి సారూ.. నా తల్లి నుంచి వారసత్వంగా వచ్చిన రెండు ఎకరాల 10గుంటల భూమిని కబ్జా చేశారు. ఆ భూమిపై తనకు పాస్ బుక్ ఇప్పించాలి' అని నల్లగొండ జిల్లా దామచర్ల మండలం ఇర్కిగూడెం గ్రామానికి చెందిన 80 సంవత్సరాల వయస్సు ఉన్న ఓ వృద్ధురాలు వేడుకొంది. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో లొట్లపల్లి సావిత్రమ్మ తన గోడును వెల్లబోసుకుంది. నల్లగొండ జిల్లా దామచర్ల మండలం ఇర్కిగూడెం సర్వేనెంబర్ 11/105 లో 2.10 ఎకరాల భూమి తన తల్లి కొటిక లచ్చమ్మ నుంచి వారసత్వంగా వచ్చిందని, ఆ భూమిని 2020 వరకు సాగు చేసినట్లు చెప్పారు. వయస్సుపై బడడం, కుమారుడు మానసిక వైకల్యంతో బాధపడుతుండడంతో చేతకాక ఆ భూమిలో పంటలు వేయలేదని, దీంతో పడావుగా మారిందన్నారు. 30సంవత్సరాలుగా ఆ భూమి తన కబ్జాలోనే ఉందని కబ్జాదారుల కన్ను తన భూమిపై పడిందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి ముఖ్య నాయకుడి మద్దతుతో కొంత మంది తనకు ఇబ్బందులు సృష్టించారని, తప్పుడు పత్రాలతో ఆ భూమిని స్వాధీనం చేసుకోనేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. వారసత్వంగా వచ్చిన భూమిని ఎలా కబ్జా చేస్తారని ప్రశ్నిస్తే తనతో పాటు మానసిక వైకల్యం తో బాధపడుతున్న తన కుమారుడిపై దాడి చేశారని ఆమె కన్నీటి పర్యంతం అయ్యారు.ఈ అంశంపై నల్గొండ జిల్లా రెవెన్యూ ట్రిబ్యునల్ లో ఫిర్యాదు చేయగా సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ఆదేశించిందని తెలిపారు. తనకు న్యాయం చేయాలని దామరచర్ల తహశీల్దార్, రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కబ్జా నివేదిక ఇవ్వనీయకుండా రెవెన్యూ అధికారులను జిల్లాస్థాయి ముఖ్య నాయకుడు అడ్డుకుంటున్నాడని ఆమె అన్నారు. సీఎం స్పందించి తన ఆధీనంలో ఉన్న భూమికి పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని ఆమె విజ్ఞప్తి చేసింది. మండల తహసీల్దార్ జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన నివేదికలో ఆమెకు లావుని పట్టా ఇచ్చినట్లు ఎలాంటి ఆధారాలు లేవని, సర్వే నెంబర్ 11 ప్రభుత్వ భూమి అని పేర్కొన్నట్టు తెలిసింది.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



పింటూ సావ్(ఫైల్)

అడ్డగూడూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఝార్ఖండ్ రాష్ట్రంలోని కోడర్మా జిల్లా డొగోడి మండలానికి చెందిన పింటూసావ్ (30) యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని గురుజాల నుంచి చౌళ్లరామారం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం రెండు నెలలుగా హిటాచి డ్రైవర్‌గా వచ్చి పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి అడ్డగూడూరు గ్రామ శివారులో పని ముగించుకొని ఆదివారం రాత్రి సూమారుగా 9 గంటలకు మండల కేంద్రంలో భోజనం చేశారు. తిరిగి బైక్‌పై హిటాచీ వాహనం వద్దకు వెళ్తున్న సమయంలో అడ్డగూడూరు గ్రామ శివారులోని బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడ్డాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సోమవారం తెల్లవారు జామున వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్తున్న రైతులు పింటూసావ్‌ను గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచానామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ట్రాక్టర్ అదుపుతప్పి..



షేక్ బాబా (ఫైల్)

గరిడేపల్లి,(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్ మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. ఏఎస్ఐ రాములునాయక్, సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన షేక్ బాబా(37) అదే గ్రామానికి చెందిన షేక్ పాషా ట్రాక్టర్ ట్రాక్టర్‌లో ధాన్యంతో మిర్యాలగూడలోని రైస్ మిల్లుకు తీసుకెళ్లి ధాన్యం దిగుమతి చేసి తిరి గి వస్తున్న క్రమంలో రాత్రి 11గంటల సమయంలో గరిడేపల్లి మండల పరిధిలోని ఎల్బీనగర్ శివారులో ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డుకు ఎడమ వైపు ఫుట్‌పాత్‌ను ఢీకొనడంతో ఛాతికి బలమైన గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108లో హుజూర్‌నగర్ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. పరిశీలించిన డాక్టర్ బాబా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. బాబా భార్య రేష్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

బైక్‌పై ఇంటికి వెళ్తుండగా..

మాడ్గులపల్లి, (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కుక్కడం గ్రామ శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అభంగాపురం గ్రామానికి చెందిన మౌలాన మాడ్గులపల్లి మండలంలోని కారు షెడ్డులో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. పని ముగించుకొని తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా పెద్ద దేవులపల్లి నుంచి కుక్కడం గ్రామానికి వస్తున్న లారీ ఢీకొట్టడంతో మౌలానకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంటనే క్షతగాత్రుడిని మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.


కుమారుడు మాట వినడం లేదని..

నల్లగొండ క్రైం, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన జిల్లాకేంద్రంలో సోమవారం జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పానగల్ రోడ్డులోని సంది పాపిరెడ్డికాలనీకి చెందిన సిగపట్ల నాగరాజు(45) గుర్రంపోడు ఎస్ఎల్‌బీసీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. నాగరాజుకు భార్య జ్యోతి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు డిగ్రీ పూర్తి చేశాడు. చిన్న కుమారుడు డిగ్రీ చదువుతున్నాడు. పెద్ద కుమారుడు కొద్ది రోజులుగా తండ్రి నాగరాజు చెప్పే మాటలు వినకపోవడంతో పాటు పలు సందర్భాల్లో ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురైన నాగరాజు సోమవారం ఉదయండ్యూటీకి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేశాడు. నిద్రవస్తోందని చెప్పి బెడ్ రూంలోకి వెళ్లి చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గంట తర్వాత చూసిన ఆయన భార్య, కుమారులు నాగరాజు ఫ్యాన్‌కు వేలాడుతుండడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు చెప్పారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ టూటౌన్ ఎస్ నాగరాజు తెలిపారు.

రూ.20లక్షల విలువైన పత్తి దగ్ధం

ఆత్మకూరు(ఎం) నవంబరు 25: (ఆంధ్రజ్యోతి): పత్తి గింజలు నిల్వ చేసే గోదాములో అగ్ని ప్రమాదం జరిగి రూ.20లక్షల విలువైన పత్తి కాలిపోయింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలకేంద్రంలోని సిద్దేశ్వర కాటన్ ఇండస్ట్రీస్‌లో సోమవారం జరిగింది. పత్తి గింజల నిల్వ చేసిన గోదాంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు బయట నిల్వచేసిన పత్తికి అంటుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మిల్లులో పనిచేసే కార్మికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. మోత్కూరు నుంచి అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. రూ.20 లక్షల విలువ చేసే పత్తి కాలిపోయిందని నిర్వాహకులు తెలిపారు. తహసీల్దార్ వి. రవికుమార్, ఎస్ఐ కృష్ణయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



కోటయ్యాచారి (ఫైల్)

నిడమనూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండల పరిధిలోని నారమ్మగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్ఐ గోపాల్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొడ్డుపల్లి కోటయ్యాచారి(42) మిర్యాలగూడలో ఓ సామిల్లు లీజుకు తీసుకొని నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మిల్లు వద్దకు వెళుతున్నానని ఈనెల 23వ తేదీన ఉదయం భార్యకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. మధ్యాహ్నం కోటయ్యాచారి భార్య నిర్మల మిల్లు వద్దకు వెళ్లి చూడగా మిల్లు మూసి ఉంది. భర్త కూడా అక్కడ కన్పించలేదు. రెండు రోజులుగా ఇంటికి రాకపోడంతో చుట్టుపక్కల వారు, బంధువుల ఇళ్లలో ఆరా తీసినా భర్త ఆచూకీ లభించలేదు. దీంతో తన భర్త కనిపించడం లేదని నిర్మల నిడమనూరు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాదగిరిగుట్టలో వైభవంగా కార్తీక వ్రతాలు



సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

భువనగిరి అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సత్యదేవుని వ్రతాలు, హరిహరాదులకు పూజలు వైభవంగా జరిగాయి. కొండకింద వ్రత మండపాల్లో 1206 జంటలు వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నాయి. కొండపై, కింద కార్తీక దీపారాదనలు చేసి మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కొండపైన హరిహరులను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులను తరలించేందుకు అధికారులు తగినన్ని బస్సులు ఏర్పాటు చేశారు. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచ రాత్రాగమరీతిలో, శ్రీపర్వవర్థిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్ర రీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో ఉత్సవ మూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలిపూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సంధ్యవేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలో ముఖమండపంలో స్ఫటికమూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతి ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 44,70,794ల ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

వృద్ధురాలిని మోసగించిన నిందితుల అరెస్టు

● రూ.2కోట్ల ఆస్తి కొట్టేసిన ఘటనలో ముగ్గురికి రిమాండ్ ● 33గుంటలకు ఒప్పందం చేసుకొని 2.37ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు నిర్ధారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నల్లగొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): వృద్ధురాలిని మోసగించి రూ2కోట్ల ఆస్తి కొట్టేసి ఘటనలో ముగ్గురు నిందితులను నల్లగొండ జిల్లా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. 'వృద్ధురాలిని మోసగించి.. రూ.2కోట్ల ఆస్తి కొట్టేసి' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ఈ నెల 21వ తేదీన ప్రచురితమైన కథనానికి పోలీసులు, అధికారయంత్రాంగం స్పందించింది. ఈ వ్యవహారానికి బాధ్యులైన ముగ్గురు నిందితులు తల్లమల్ల హసేన్, తల్లమల్ల రాజు, తల్లమల్ల విజయ్‌ని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు కర్ర శ్రీరాములమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి. సాయిప్రశాంత్ దర్యాప్తు చేశారు. శ్రీరాములమ్మను సమీప బంధువులైన ముగ్గురు ఉద్దేశపూర్వకంగా మోసం చేసిన విషయాన్ని నిగ్గుతేల్చారు. వివరాల్లోకి వెళితే.. నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం పెద్దసూరారం గ్రామానికి చెందిన కర్ర శ్రీరాములమ్మకు సర్వేనెంబర్లు సర్వేనెంబర్లు 638/1, 640/0, 641/అ, 641/ఆ లలో మొత్తం 2.37 ఎకరాల భూమి ఉంది. ఆమె భర్త చనిపోవడం, ఏకైక కుమారుడు సైతం 2023లో చనిపోవడంతో ఒంటరిగా మిగిలిన శ్రీరాములమ్మ తనకున్న భూమిలో 638/1లో ఉన్న 33 గుంటల భూమిని తనకు వరుసకు సోదరుడయ్యే తల్లమల్ల హసేన్‌కు అమ్మేందుకు ఇష్టపడి అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే శ్రీరాములమ్మ నిరక్షరాస్యతను, ఒంటరితనాన్ని ఆసరాగా చేసుకున్న హసేన్, అతని ఇద్దరు కుమారులు రాజు, విజయ్ రిజిస్ట్రేషన్ సమయంలో అక్రమానికి పాల్పడ్డారు. శ్రీరాములమ్మకు తెలియకుండా ఆమెకున్న 2.37ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకోవడమే కాకుండా, రిజిస్ట్రేషన్ సమయంలో శ్రీరాములమ్మని ఏమార్చి హడావిడిగా 17.10.2024న సాయంత్రం సంతకాలు చేయించుకున్నారు. ఉద్దేశపూర్వకంగానే ఆమెను మోసం చేసి 33గుంటల బదులు 2.37 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రిజిస్ట్రేషన్లు పూర్తయిన తర్వాత 30వ తేదీన శ్రీరాములమ్మ తన పాస్ బుక్ సరిచేయించుకునే నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లింది. తాను మోసపోయిన విషయం గుర్తించి తనకు జరిగిన అన్యాయంపై హసేన్, అతని కుమారులపై ఈనెల 4వ తేదీన తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తిప్పర్తి పోలీసులు విచారణ చేపట్టారు. అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారం, వృద్ధురాలిని మోసిగించిన వైనంపై ఈ నెల 21వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లోనూ కథనం ప్రచురితమవడంతో నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్, డీఎస్పీ శివరాంరెడ్డి విచారణపై ప్రత్యేక దృష్టిసారించారు. పోలీసుల విచారణలో వృద్ధురాలైన, నిరక్షరాస్యురాలైన శ్రీరాములమ్మని ఉద్దేశపూర్వకంగానే హసేన్, అతని ద్దరు కుమారులు మోసం చేసిన విషయాన్ని విచారణలో పోలీసులు నిగ్గుతేల్చారు. ఈ మేరకు సోమవారం నిందితులు హసేన్, రాజు, విజయ్‌ని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ బి. సాయిప్రశాంత్ తెలిపారు.

బాలికపై లైంగిక దాడి

● యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఆత్మకూరు(ఎం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగికదాడికి పాల్పడిన యువకుడిపై యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) పోలీసులు సోమవారం పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన దుంప ప్రవీణ్(22) కూలిపని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన బాలిక(14) నానమ్మ వద్ద ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతోంది. బాలిక తండ్రి పదేళ్ల క్రితమే మృతిచెందగా, తల్లి పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 23న రాత్రి ప్రవీణ్ ఆ బాలికను గ్రామంలో ఓ ఇంటి మేడపైకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడి అక్కడినుంచి పారిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు బాలిక నానమ్మ అక్కడికి వెళ్లి చూడగా, ఏడుస్తూ కనిపించింది. ఇంటికి తీసుకువచ్చి ప్రశ్నించగా, దుంప ప్రవీణ్ తనపై లైంగికంగా దాడి చేశాడని చెప్పింది. బాధితురాలి నానమ్మ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, ప్రవీణ్‌పై పోక్సో కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనపై విచారణ చేస్తున్నామని, బాలికను వైద్యపరీక్షలకు పంపుతామని తెలిపారు.

ఊర కుక్కల దాడిలో వ్యక్తికి గాయాలు

శాలిగౌరారం, నవంబరు 25,(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిపై ఆకస్మాత్తుగా ఊర కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో సోమవారం జరిగింది. శాలిగౌరారం ఎస్సీ కాలనీ చెందిన తోటకూరి బాబు ఆదివారం ఉదయం తన వ్యవసాయం పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్లుతుండగా శాలిగౌరారం బస్‌స్టేజీ సమీపంలో ఆకస్మాత్తుగా ఊర కుక్కలు దాడి చేశాయి. చేతులకు, కాళ్లకు, వీపు మీద కరిచాయి. తీవ్ర గాయాలు పాలైన బాబును అక్కడికి చేరుకున్న గ్రామస్తులు కుక్కలను తరిమి కొట్టి బాబు రక్షించి చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ట్రిపుల్‌ఆర్ నిర్వాసితులపై అసెంబ్లీలో చర్చిస్తా

ఉమ్మడి నల్లగొండలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు స్వాగతం



యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో మాజీమంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు

భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్‌టౌన్, అర్వపల్లి, నార్కట్‌పల్లి, చిట్యాల, ఆలేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో ఆస్తులు కోల్పోతున్నవారికి న్యాయం జరిగేలా అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని చౌటుప్పల్‌కు చెందిన భూనిర్వాసితుల ఐక్యవేదిక బాధ్యులు వినతిపత్రం ఇవ్వడంతో ఈ మేరకు ఆయన స్పందించారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా మానుకోటలో నిర్వహించే మహా ధర్నాకు వెళుతున్న ఆయనకు సోమవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, నకిరేకల్, అర్వపల్లి మీదుగా మహబూబాబాద్ జిల్లాకు వెళ్లారు. కేటీఆర్ కాన్వాయ్‌లో 100కార్లు ఉన్నాయి. అర్వపల్లిలో కేటీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ కలావరం బహూకరించారు. అనంతరం అర్వపల్లిలో మాజీ జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ ఇంటికి వెళ్లి తేనీటి విందు స్వీకరించారు. కేటీఆర్‌కు రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, సూర్యాపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, రవీంద్రకుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, గాదరి కిషోర్‌కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, యాదాద్రిభువనగిరి జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, సూర్యాపేట జడ్పీ మాజీ చైర్మన్ గుజ్జ దీపికాయుగేంధర్‌రావు తదితరులు స్వాగతం పలికారు.

● నార్కట్‌పల్లి వద్ద మాజీమంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలికిన వారిలో నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, మల్ల బాలకృష్ణ, నాగరాజు ఉన్నారు.

● చిట్యాలలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో కేటీఆర్‌కు కార్యకర్తలు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, మాజీ జడ్పీటీసీ శేపూరి రవీందర్, పొన్నం లక్ష్మయ్య ఉన్నారు.

● చౌటుప్పల్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు పెద్దిటి బుచ్చిరెడ్డి, కర్నాటి వెంకటేశం, గిర్కటి నిరంజన్‌గౌడ్, చిన్నం బాలరాజ్ తదితరులు స్వాగతం పలికారు.

● చౌటుప్పల్ వద్ద కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు వెళ్లిన వారిలో ఆలేరు మునిసిపల్ చైర్మన్ వస్పరి శంరయ్య, నాయకులు పుట్ట మల్లేష్, కర్రె అశోక్, పత్తి వెంకటేష్, బేతి రాములు, కుండే సంపత్, గోరుమియ, జమాల్, ఫయాజ్ ఉన్నారు.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.129	208	236
సూర్యాపేట	రూ.120	180	200
నల్లగొండ	రూ.130	190	220

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	585.50
టీఎంసీలు	302.9125
ఎడమకాల్వకు నీటి విడుదల	3431
కుడికాల్వకు	10,000
విద్యుత్ కేంద్రం ద్వారా	25,172
ఎస్ఎల్‌బీసీ ద్వారా	24,00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	35,315
అవుట్‌ఫ్లో	41,303 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.54 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	330 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	2వేల క్యూసెక్కులు

మూసీ నీటిమట్టం


పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.70 అడుగులు
టీఎంసీలు	4.38
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	278.70 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	93.44 క్యూసెక్కులు

క్యాంపస్ సమాచారం

నేటి పరీక్ష వాయిదా

నల్లగొండ టౌన్, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం జరగాల్సిన డిగ్రీ మూడు, ఐదవ సెమిస్టర్లలో ఒక పరీక్షను వాయిదా వేసినట్లు సీఈవో డాక్టర్ ఉపేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా వేసిన పరీక్షను డిసెంబరు 16వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి జరగనున్న డిగ్రీ పరీక్షలు యథాతథంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

ఏబీవీపీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యురాలిగా ఝాన్సీ



హాలియా, నవంబర్ 25: తెలంగాణ ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ ఈ నెల 22, 24 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గోరక్‌పూర్‌లో జరిగిన 70వ జాతీయ మహాసభలలో సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. అనుముల మండలం శ్రీనాథపురం(అంబట్‌పల్లి) గ్రామానికి చెందిన ఝాన్సీ హైదరాబాద్‌లో ఎల్‌ఎల్ఎమ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యురాలిగా తనను ఎన్నుకున్నారని తెలిపారు. జాతీయ భావంతో జాతీయ పునర్నిర్మాణానికి కృషి చేస్తున్న విద్యార్థి పరిషత్ అనేక సమస్యలపైన నిరంతరం ఉద్యమాలు చేస్తూ విద్యార్థి, నిరుద్యోగ, ప్రజలకు సంఘం పని చేస్తుందన్నారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని ఝాన్సీ తెలిపారు. ఆమె గతంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా, నగర కార్యదర్శిగా రెండు సార్లు జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా పని చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలి

కోదాడ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి మండలం వాయిలసింగారం గ్రామంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల మానిటరింగ్ కమిటీ పార్లమెంట్ కన్వీనర్ వంగవీటి శ్రీనివాసరావు కోరారు. సోమవారం కోదాడలో ఆయన విలేకరులలో మాట్లాడుతూ మండలంలోని వాయిలసింగారం అతిపెద్ద రెవెన్యూ గ్రామమని, ధాన్యం ఉత్పత్తిలో కూడా ఈ గ్రామమే అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రైవేటుగా ధాన్యం కొనుగోలు చేసే దళారుల రాజకీయ ప్రభావంతోనే వాయిలసింగారం గ్రామంలో మండల అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదని ఆయన ఆరోపించారు. వాయిలసింగారంలో యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, వివక్ష చూపిన మండల అధికారులపై తగిన చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఈ మేరకు కోదాడ ఆర్డీవో సూర్యానారాయణకు వినతిపత్రం అందజేశారు.

వేసెక్టమీ చేయించుకోవడం ఉత్తమం

నేరేడుచర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణ కోసం పురుషులు వాసెక్టమీ ఆపరేషన్ చేయించుకోవడం ఎంతో ఉత్తమమని వైద్యాధికారి పున్నం నాగిని అన్నారు. వేసెక్టమీ పక్షోత్సవాలలో భాగంగా సోమవారం నేరేడుచర్లలోని పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసెక్టమీ ఆపరేషన్‌ను ఎటువంటి కోత, కుట్టు లేకుండా తేలికగా చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ధనమ్మ, అసిస్టెంట్ నర్సయ్య, విజయ, సుశీల, రేణుక, సునిత, నాగమణి, నాగేంద్రమ్మ, భూలక్ష్మి, శిరీష, ప్రాల్గొన్నారు.

భూసేకరణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆర్డీవో

తిరుమలగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ప్రాజెక్టు కాలువల కోసం భూసేకరణ కార్యక్రమాన్ని సూర్యాపేట ఆర్డీవో వేణు మాధవరావు సోమవారం పరిశీలించారు. తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధి మాలిపురంలో ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ హరిప్రసాద్, డిఈ శ్రీకాంత్ వర్మ, ఈఈ కమలాకర్, ఆర్ఐ బాబా తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం'

హుజూర్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం జరుగుతుందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, మునిసిపల్ చైర్మన్ గెల్లి అర్చనరవి, వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డిలు అన్నారు. పట్టణంలోని కౌండిన్య ఫంక్షన్ హాల్‌లో సంగీత నాటక అకాడమి చైర్మన్ పుంజాల అలేఖ్యను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుదారు. అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దొంతగాని శ్రీనివాస్, కేఎల్ఎన్ ప్రసాద్, సూదులునాయక్, సతీష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలి

గరిడేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి: పెంచి ఎరువుల ధరలను ప్రభుత్వాలు వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకుబ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోలోని తాళ్లమల్కాపురంలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేటలో ఈ నెల 29న జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య, వెంకటేశ్వర్లు, దనయ్య, కిష్టయ్య, ప్రసాద్, మురళి, బాబు, అంజయ్య, గుర్వయ్య, లక్ష్మీనారాయణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అరకొరగా ధాన్యం కొనుగోలు: బీజేపీ

మునగాల రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అరకొరగా ధాన్యాన్ని కొనుగులు చేస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. సోమవారం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అరకొర వసతులతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి కృష్ణ, కనగాల నారాయణరావు, గ్రామ, మండల నాయకులు పాల్గొన్నారు.

'పీఎం కిసాన్' దరఖాస్తులు పూర్తిచేయాలి

కోదాడ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పీఎం కిసాన్ పథకం దరఖాస్తులను ఈ నెల 30 నాటికి పూర్తి చేయాలని ఏడీఏ యల్లయ్య అన్నారు. సోమవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. చిలుకూరు మండలంలో నాలుగు సెంటర్ల ద్వారా ఇప్పటివరకు 500 క్వింటాళ్ళ ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కోదాడలో 17 సెంటర్ల ద్వారా రూ. 15,972 క్వింటాళ్ళ ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. . మోతెలో 25 సెంటర్ల ద్వారా 24,350 క్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు చేశామన్నారు. అనంతగిరిలో 10 సెంటర్ల ద్వారా 481 క్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు చేశామన్నారు. నడిగూడెంలో ఐదు సెంటర్ల ద్వారా 500 క్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మునగాలలో 8 సెంటర్ల ద్వారా నాలుగు వేల క్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతులు తాము పండించిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఏవో రజినీ, మునగాల ఏఓ రాజు, అనంతగిరి ఏవో సతీష్, మోతె, నడిగూడెం, చిలుకూరు ఏవోలు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

పెన్‌పహాడ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మలిదశ ఉద్యమకారుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని మలిదశ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మైసయ్య కోరారు. సోమవారం పెన్‌పహాడ్ మండలంలో మలిదశ ఉద్యమకారులతో నిర్వహించిన ర్యాలీలో వారు పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన హామీ ప్రకారం 250 గజాల ఇంటి స్థలం, రూ. 25వేల పింఛనుఅమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మలిదశ ఉద్యమకారులు భూక్యా చిత్తరంజన్, దండెంపల్లి సత్యనారాయణ, పుట్టల నాగలక్ష్మి, నారాయణ లింగారెడ్డి, బెల్లంకొండ డాంగ్రే, నెమ్మాది వీరబాబు, బంటురాజు, వెంకన్న, సైదులు, అయోధ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలి

సూర్యాపేటటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణ ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేపట్టాలని టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములుమాదిగ కోరారు. . సోమవారం జిల్లా కేంద్రంలోని ఆసంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీలలో ఉన్న 59 ఉపకులాలకు రిజర్వేషన్లు అందడం లేదని వర్గీకరణతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పుట్టల శ్రవణ్‌కుమార్, నాయకులు బొడ్డు సైదమ్మ, పిడమర్తి మధు, మీసాల శివరామకృష్ణ, బొడ్డు మల్సూర్, బొల్లె అశోక్, సూరారపు నాగయ్య, మీసాల గౌతం, గంగారపు సాయిరాం, పొడపంగి విఘ్నేష్, ములకలపల్లి శ్రీను, ములకలపల్లి అంజయ్య, వేదాసు దనమ్మ, బొడ్డు వెంకటమ్మ, యాతాకుల సంధ్య పాల్గొన్నారు.

చదరంగంలో రాణించిన సింధు

కోదాడ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చదరంగం పోటీల్లో మండలంలోని కొమరబండ తేజ విద్యాలయం విద్యార్థి ప్రతిభ చూపిందని ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి అండర్-11 చదరంగం పోటీలు సూర్యాపేటలో జరగ్గా, తమ పాఠశాలకు చెందిన 3వ తరగతి విద్యార్థి సింధూ శరణ్య ప్రథమ బహుమతి సాధించిందన్నారు. విజేతగా నిలిచిన సింధూ శరణ్యకు మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ట్రోఫీ అందజేసినట్లు తెలిపారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కోదాడ టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందనికోదాడ మార్కెట్ కమిటీ సెక్రటరీ రాహుల్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ అయ్యప్ప మాలధారుల అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

మార్కెట్‌లో ధాన్యం దొంగలు

● వరుస చోరీలతో రైతుల కుదేలు ● 10 నెలలుగా పనిచేయని సీసీ కెమెరాలు ● కొరవడిన భద్రత



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం, అలంకారప్రాయంగా ఉన్న సీసీ కెమెరా (ఇన్‌సెట్లో)

భానుపురి, మద్దిరాల నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి సాగు చేసిన రైతులకు పంట ఉత్పత్తులను విక్రయించాలంటే అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. విక్రయించడానికి మార్కెట్‌కు తెచ్చిన బస్తాలు మాయం అవుతున్నాయి. దీంతో రైతులు పంటలు పండించడం ఒక ఎత్తైతే.. ఉత్పత్తులను కాపాడుకోవడం మరో ఎత్తవుతోంది. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం రాత్రి ధాన్యం బస్తాలు మాయమయ్యాయి. మార్కెట్ యార్డులో రైతు కుంట్ల మాధవరెడ్డి కల్లంలో ఆదివారం తొమ్మిది బస్తాల ధాన్యం చోరీ అయింది. ఈ నెల ఐదో తేదీన సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు గొట్టిముక్కుల అనంతరెడ్డి కల్లంలో 29 బస్తాల ధాన్యం చోరీ అయింది. ఈ ఘటనను మరవక ముందే ఆదివారం మరో ఘటన జరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో కాంటాలు పూర్తయి బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమయ్యే తరుణంలో ఇలా చోరీ జరగడంతో రైతులు కలత చెందుతున్నారు. మార్కెట్‌లో పర్యవేక్షణ కొరవడినందునే ధాన్యం బస్తాలు మాయం అవుతున్నాయని రైతులు చెబుతున్నారు. మార్కెట్‌కు నాలుగు వైపులా గేట్లు ఉన్నాయి. చోరీ చేసి ధాన్యాన్ని ఏ గేటు నుంచి బయటికి తరలిస్తున్నారో తెలియడం లేదని రైతులు చెబుతున్నారు. గేట్ల వద్ద రాత్రి వేళ సెక్యూరిటీ కూడా సక్రమంగా ఉండటంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధాన్యం చోరీ అవుతున్నా మార్కెట్ సిబ్బంది తమకు ఏమాత్రం సంబంధంలేనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 24గంటలూ కాపాలా ఉండాలన్సిన స్వీపర్లు కనీసం నాలుగు గంటలు కూడా ఉండటంలేదని రైతులు చెబుతున్నారు.

అలంకారప్రాయంగా మారిన సీసీ కెమెరాలు

మార్కెట్‌లో ప్రాంగణంలో, షెడ్లలో, గదుల్లో రెండేళ్ల క్రితం రూ.40లక్షల వ్యయంతో 54 సీసీ కెమెరాలను అమర్చారు. అయితే నాణ్యతలేని వైర్లను వినియోగించినందున మరమ్మతులకు వచ్చి పని చేయడం లేదని రైతులు తెలి పారు. మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు సీసీ కెమెరాలు పనిచేస్తున్నట్లు సిబ్బంది చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సుమారు 50 సీసీ కెమెరాలను అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వినియోగించినందున మరమ్మతులకు వచ్చినట్లు మార్కెట్ అధికారులు చెబుతున్నారు. అయితే సీసీ కెమెరాలకు మరమ్మతు చేయించనం దున రైతుల ధాన్యానికి భద్రత కరువైంది. మార్కెట్‌లోకి రాకపోకలు సాగించే వాహనాలను కూడా సెక్యూరిటీ సిబ్బందితో పసిగట్టలేని పరిస్థితి ఉంది. మార్కెట్‌పై అధికారుల పర్యవేక్షణ కొరవడినందున తమ ధాన్యానికి భద్రత లేదని రైతులు తెలిపారు గ్యారెంటీ లేకుండా పోయిందని రైతులు తెలిపామంగా లేదని వ్యాపారులు అంటున్నారు.

●మద్దిరాల మండలంలో ఏర్పాటు చేసిన ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాత్రికి రాత్రే మాయం అవుతోందని రైతుల తెలిపారు. కష్టపడి పండించిన ధాన్యాన్ని విక్రయించడానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకవస్తే, చోరీ అవుతున్నాయని, ఈ ఉదంతపై నిర్వాహకులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదని రైతులు తెలిపారు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు వాచ్‌మన్లకు నియమించాలని రైతులు కోరుతున్నారు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో చోరీ చేస్తున్నారని మండలంలోని మామిళ్లమడవ గ్రామానికి చెందిన రైతు చందునాయక్ తెలిపారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం

మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలు 10నెలల నుంచి పనిచేయడంలేదు. ఈ నెలలోనే రెండు పర్యాయాలు రైతుల ధాన్యం చోరీ అయ్యాయి. మార్కెట్ సిబ్బంది పర్యవేక్షణను పెంచాలి. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

● పర్వతాలు, పృథ్వీనాథ్ ట్రేడర్స్ సంఘం అధ్యక్షుడు

ఫిర్యాదు వచ్చింది

మార్కెట్ యార్డులోని కుంట్ల మాధవరెడ్డి కల్లాంలో తొమ్మిది బస్తాల ధాన్యం చోరీ అయిందని ఫిర్యాదు వచ్చింది. సీసీ కెమెరాలను మరమ్మతులు చేయించాలని ఉన్నతస్థాయి అధికారులను కోరాం. సమయం పడుతుందని చెప్పారు. ధాన్యం చోరీపై విచారణ చేస్తున్నాం.

● సంతోష్‌కుమార్, మార్కెట్ కార్యదర్శి, సూర్యాపేట

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను అభివృద్ధి చేస్తా



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని గణపవరం గ్రామంలో రూ.84 లక్షలతో గణపవరం నుంచి యర్రవరం, రూ.50లక్షలతో మేళ్లచెర్వు రోడ్డు నుంచి గణపవరం వరకు బీటీ రోడ్ల నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారులకు నిధులు మంజూరు చేయనందున మోకాళ్ల లోతు గుంతలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రహదారి సౌకర్యం కల్పించాలని నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రతినిధి లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, మునిసిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేపూరి వెంకటాచారి, సీతారాంరెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ హిమబిందు, అమరనాయిని వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల వర్గీకరణపై అసెంబ్లీలో చర్చిస్తాం

కోదాడ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీక రణపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామని ఎమ్మెల్యే పద్మావతి హామీ ఇచ్చారు. కోదాడ డివిజన్ పరిధిలో ఇటీవల పదోన్నతి పొందిన మాదిగ ఉద్యోగులకు ఎంఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పద్మావతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా పదోన్నతి పొందిన ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బట్టు మల్లయ్య, మోలుగూరి వెంకయ్య, మాతంగి మనోజ్, ఏపూరి పర్వతాలు, నందిగామ ఆనంద్, చేకూరి రమేష్, బొలికొండ కోటయ్య, గంధం బుచ్చారావు, మాదాసు బాబు,ఏపూరి రాజు, కొండపల్లి అంజనేయులు, యలమర్తి రాము, యలమర్తి రాము, పడిశాల రఘు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

కోదాడ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపుగల్లు రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 292లో ప్రభుత్వ భూమి నుంచి మట్టిని అక్రమంగా ఎక్స్‌కవేటర్లతో తవ్వి టిప్పర్లలో తరలిస్తుండగా వాహనాలను రైతులు సోమవారం అడ్డుకున్నారు. మండలంలోని రెడ్లకుంట గ్రామానికి చెందిన రైతులు గంగవరపు లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో అడ్డుకుని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ప్రభుత్వ భూమిలో 20 అడుగుల లోతు లో గుంతలు తవ్వినందున మేతకు వెళ్లిలు గేదెలు, ఆవులు మృత్యువాత పడుతున్నాయన్నారు. మట్టి తవ్వకాలను వ్యాపారులు ఆపేసి టిప్పర్లతో సహా పరారయ్యారు. ఘటనా స్థలానికి ఆర్ఐ రాజేష్ చేరుకుని మట్టి తవ్వకాలు జరిపిన ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అక్రమ మట్టితోలకంపై ఫిర్యాదు

చిలుకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం గుట్టల్లో సీతారాంపురం గుట్టల్లోని వైకుంతధామంలో తమ పూర్వీకులు సమాధులను తొలగించి, మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఎస్సీ నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబులకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు.



కోదాడలో రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

శివాలయంలో వైభవంగా లక్ష పుష్పార్చన

సూర్యాపేటరూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా సూర్యాపేట మునిసిపల్ పరిధిలోని పిల్లలమర్రి శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవాలయంలోని మహిళలు కార్తీక దీపాలు వెలిగించి, అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎరకేశ్వరస్వామి, నామేశ్వరస్వాములకు తెల్లవారుజామున రుద్రాభిషేకం, లక్ష పుష్పార్చనను కన్నుల పండుగగా చేశారు. ఈ సందర్భంగా స్వామి వార్లను రంగురంగుల పూలు, పండ్లతో అందంగా అలంకరించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా వాసుదేవ్-వీరవేణి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్ని, అనంతరం కోటి వత్తులతో దీపారాధన చేశారు.

హుజూర్‌నగర్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్వతీ సహిత భీమాలింగేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన అభిషేకాలు, పూజల్లో భక్తులు పాల్గొన్నారు. మహిళలు .కార్తీక దీపారాధన చేయడంతో పాటు ఉసిరి చెట్టుకు పూజలు చేశారు ఈ కార్యక్రమంలో ఈవో గుజ్జుల కొండారెడ్డి, రవిశర్మ,సుబ్రహ్మణ్యశర్మ,కీత మల్లికార్జున్ పాల్గొన్నారు.

నేరేడుచర్ల (ఆంధ్రజ్యోతి):మండలంలోని శివాలయాలు భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. నేరేడుచర్లలోని శివాలయం, సోమప్ప దేవాలయం, దిర్శించర్ల శివాలయంలలో పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సూర్యాపేట టౌన్ (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీఅన్నపూర్ణసహిత విశ్వనాథస్వామి దేవాలయం, శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం, సంతోషిమాత దేవాలయాలకు భక్తులు వేకువ జామున అభిషేకాలు చేసిబ మొక్కులు చెల్లించారు.

మద్దిరాల,(ఆంధ్రజ్యోతి):. మండల కేంద్రంలో శంభులింగేశ్వర, స్వయంభు పార్వతిరామలింగేశ్వర ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో తహసీల్దార్ అమీన్ సింగ్, తుంగతుర్తి సీఐ శ్రీను నాయక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్‌వర్మ, పచ్చిపాల వెంకన్నసుమతి, కొలగాని వెంకన్న, శివస్వాములు పాల్గొన్నారు.



పిల్లలమర్రి శివాలంయంలో శివలింగానికి నిర్వహించిన లక్ష పుష్పార్చన

నేడు 'అనురాగ్'లో జాతీయ రాజ్యాంగ దినోత్సవం

కోదాడ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో కోదాడలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 26న ఉదయం 10గంటలకు రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తామని ఆ కళాశాల సహాయ సంచాలకుడు కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కోదాడ ఆర్డీవో సీహెచ్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈసందర్భంగా సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందన

మఠంపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డయాసిస్ లెవల్ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కేంద్రంలో సెయింట్ ఆల్ఫాన్సస్ హైస్కూల్‌లో జరిగిన వివిధ పోటీల్లో మఠంపల్లి మాన్‌ఫోర్ట్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. వాలీబాల్‌లో బాలుర విభాగంలో ప్రథమ బహుమతి, ఖోఖో బాలికల విభాగంలో తృతీయ బహుమతి, 100 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ, తృతీయ బహుమతులు, షాట్ పుట్‌లో ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను హెచ్‌ఎం వినోద్‌రెడ్డి సోమవారం పాఠశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంజేఎఫ్ జిల్లా అధికార ప్రతినిధిగా బాబు

మఠంపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) మాదిగ జర్నలిస్టు ఫోరం (ఎంజేఎఫ్)జిల్లా అధికార ప్రతినిధిగా మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన దేవపంగు బాబుమాదిగను నియమించారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మొగులూరి వెంకయ్య మాదిగ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేష్ ఆదేశాల మేరకు కమిటీ విస్తరణలో బాగంగా ఈ నియామకం జరిగినట్లు తెలిపారు.

ఆసుపత్రిలో పౌరసేవా పత్రం ఏర్పాటు

సూర్యాపేట సిటీ, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో పౌర సేవా పత్రం బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు. జనరల్ ఆసుపత్రిలో వివిధ దరఖాస్తులు అందజేయడానికి ప్రజలు పడుతన్న ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి' లో ఈ నెల ఎనిమిదో తేదీన పౌర సేవల చిరునామా ఎక్కడ? శీర్షికన ప్రచురిత మైన వార్తకు అధికాకారులు స్పందించారు. సూపరింటెండెంట్ కార్యాలయం గోడకు పౌర సేవా పత్రం వివరాలతో ఉన్న ఫ్లెక్సీని అతికించారు. అదేవిధంగా సమాచార హక్కు చట్టం-2005 బోర్డును కూడా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కార్యకర్తలు కష్టపడితేనే గుర్తింపు

మద్దిరాల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కార్యకర్తలు క్రమశిక్షణతో కష్టపడితేనే గుర్తింపు లభిస్తుందని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్నయాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో తన నివాసంలో తుంగతుర్తి మార్కెట్ డైరెక్టర్‌గా నియామకమైన పాక అమృతమల్లును సన్మానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రేతినేని శ్రీనివాస్, పాలబిందెల శ్రీనివాస్, కె.గోపి పాల్గొన్నారు.

శంభులింగేశ్వరస్వామికి శాంతి కల్యాణం

హుజూర్‌నగర్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని బూరుగడ్డ శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి శాంతి కళ్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిమట సైదులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యరగాని నాగన్నగౌడ్, మాజీ ఎంపిపి గూడెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రత పూజలు

హుజూర్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగడ్డ గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణస్వామివ్రత పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మణ్‌రావు, ఆలయ చైర్మన్ యరగాని గురవయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

ఉచిత విద్య అందించాలి.. సూర్యాపేట టౌన్: ప్రభుత్వాలు ప్రజలందరికీ కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య అందించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, విజయరామరాజు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సైదులు, బాస్కర్, నాగేంద్రబాబు, రమేష్, బూర్గుల భాస్కర్ పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన బీఆర్ఎస్ నాయకులు.. సూర్యా పేట(కలెక్టరేట్): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు సోమవారం సూర్యాపేట నుంచి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. ముందుగా అర్వపల్లిలో కేటీఆర్‌కు స్వాగతం పలికాలరు. ధర్నాకు వెళ్లిన వారిలోగోపగాని వెంకటనారాయణగౌడ్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, పుట్టా కిశోర్‌కుమార్, బూర బాలసైదులుగౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు ధర్నా.. ఆత్మకూర్(ఎస్): నూతనకల్: రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 26వ తేదీని నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని అరుణోదయ నాయకుడు సామ నర్సిరెడ్డి అన్నారు. సోమవారం మండలం లోని పాత సూర్యాపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తండా వెంకటయ్య, చంద్రారెడ్డి, రాములు, సూరారపు వెంకన్న, ముత్తయ్య, దేశబోయిన సైదులు, వీరారెడ్డి పాల్గొన్నారు.

● కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రాల్లో ఈ నెల 26న నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిరసన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గడ్డం పాపయ్య, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎల్లయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 1 న కమ్మ సంఘం వనభోజనాలు.. హుజూర్‌నగర్: పట్టణంలో కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో డిసెంబరు ఒకటో తేదీన కార్తీక వనభోజన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు శాఖమూరి రవికుమార్, కేఎల్ఎన్ రావు, చావా సహదేవరావు తెలిపారు. పట్టణంలోని లక్కవరం రోడ్డులోని కోట లక్ష్మీనరసింహారావు మామిడి తోటలో నిర్వహించే వనసమారాధాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోట హరిప్రసాద్,మట్టపల్లిరావు, పొనుగుపాటి వెంకటేశ్వరరావు, చిరుమామిళ్ల సుధీర్, ప్రసాద్, కోట లక్ష్మి, శ్రీను, పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని పునఃనిర్మించాలి.. గరిడేపల్లి: మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహాన్ని పున:నిర్మించాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కమిటీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవి కోరారు. ఈ మేరకు .కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. రోడ్డు విస్తరణ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించి తహసీల్దార్ కార్యక్రమంలో ఉంచారన్నారు.కల్మలచెర్వు రోడ్డులోని డివైడర్ ప్రాంతంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నకిరేకంటి రవి, బచ్చలకూరి నాగార్జున, ఆలంపల్లి శేఖర్, ఎన్.రవీందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత.. కోదాడ రూరల్: ప్రభుత్వ పథకాలపై మండలంలోని కాపుగల్లు, నల్లబండగూడెం గ్రామాల్లో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు కళాకారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవీ వీవీ రాంచందర్‌రావు, ఎంపీవో పాండురంగన్న, టీం లీడర్ ఇర్ల సాయి,పాల్గొన్నారు.

కాంటాల్లో వేగం పెంచాలి.. మోతె.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాల్లో వేగం పెంచాలని నిర్వాహకులను తహసీల్దార్ సంఘమిత్ర అదేశించారు. . సోమవారం మండలంలోని విభలాపురం, మామిళ్లగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వెంకయ్య, సీసీలు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఈ నెల 29నుంచి సీపీఎం జిల్లా మహాసభలు.. మోతె, మద్దిరాల: జిల్లా కేంద్రంలో ఈ నెల 29, 30 డిసెంబరు ఒకటో తేదీన నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మట్టిపెల్లి సైదులు అన్నారు. సోమవారం మండలంలోని సిరికొండ, రాఘవాపురం, గ్రామాల్లో జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, ఏసు, పోతయ్య అశోక్, మల్లయ్య పాల్గొన్నారు.

● సీపీఎం జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి, మండల కార్యదర్శి పోలోజు సైదులు కోరారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పులుసు సత్యం, కల్లెపల్లి భాస్కర్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామ కమిటీల ఎన్నిక.. మునగాల రూరల్: మండలంలోని నేలమర్రి గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ, గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా మొలుగూరి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా కొలకపంగు శ్రీను,ప్రధాన కార్యదర్శిగా బచ్చలకూరి హరీష్, కార్యదర్శిగా బచ్చలకూరి హరీష్, కోశాధికారిగా పిడమర్తి తరుణ్, ఎంఎస్పీ గ్రామశాఖ అధ్యక్షుడిగా పోకల మల్సూర్, ప్రధాన కార్యదర్శిగా బచ్చలకూరి కిరణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బచ్చలకూరి సికిందర్, రమేష్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం ఆరబెట్టి తీసుకురావాలి.. మద్దిరాల: కొనుగోలు కేంద్రాలకు రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకురావాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. సోమవారం మద్దిరాల మండలం రామచంద్రాపురంగ్రామంలో ధాన్యాన్ని పరిశీలించి ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ వహిద్దీన్, ఏపీఎం మైసయ్య, సీసీలు నాగార్జున్‌రెడ్డి, రమేష్, ఏఈఓలు పాల్గొన్నారు.

కళలను కాపాడటం అభినందనీయం.. నూతనకల్: గ్రామీణ ప్రాంత కళలను కాపాడడం అభినందనీయమని డీసీసీ ఉపాధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్ అన్నారు. సోమవారం మండలంలోని బక్క హేమ్లతండా ఆవాసం మాన్‌సింగ్‌తండాలో మహిళలకు తన సొంత ఖర్చులతో కోలాటం నేర్పించారు. ఈ సందర్భంగా మహిళలు దాతలనుసన్మానించారు. ఈ కార్యక్రమంలో బాలు, నాగు, దామోదర్‌నాయక్, బల్సింగ్, నరేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాజిరెడ్డి పోరాటం మరువలేనిది.. తుంగతుర్తి: తెలంగాణ పోరాట యోధులు దాయం రాజిరెడ్డి పోరాటం మరువలేనిదని పలువురు నాయకులు అన్నారు. రాజిరెడ్డి 46వ వర్ధంతి సందర్భంగా వెంపటి గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ న్యాయవాది గుగులోతు రాజారాం, అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కార్యదర్శి కోట రామస్వామి, నాయకులు మల్లేశం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు కాంగ్రెస్‌లోనే గుర్తింపు.. తుంగతుర్తి: సామాన్య కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలోనే గుర్తింపు లభిస్తుందని తుంగతుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే మందుల సామేలుకు, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తనుక్, ఉప్పుల రాంబాబు, శంకర్, అనిల్, అంజయ్య తదితరులు ఉన్నారు.